ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 సిద్దిపేట

శుక్రవారం 6 జూన్ 2025



మంత్రి కొండా సురేఖ నుంచి ప్రశంసా పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ సునిత, వైస్ ప్రిన్సిపాల్

డిగ్రీ కళాశాలకు
ప్రశంసా పురస్కారం

సిద్దిపేట కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి ప్రశంసా పురస్కారం దక్కింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి సురేఖ నుంచి కాలుష్య నియంత్రణ మండలి ప్రశంసా పురస్కారాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపల్ అయోధ్యరెడ్డి అందుకున్నారు. పర్యావరణహితమైన కార్యక్రమాలను చేపట్టడం, కాలుష్య నియంత్రణకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం. అలాగే సౌరశక్తి వినియోగం, ఎల్ఈడీ, సెన్సార్ ఆధారిత విద్యుత్ వ్యవస్థలు, వర్షపునీరు సంరక్షణ పద్ధతి, రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ (ఆర్ఏఎస్), డ్రిప్ సేద్యం, మల్చింగ్ వంటి కార్యక్రమాల నిర్వహణతో పాటు వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్, రీసైక్లింగ్ కార్యక్రమాలను కళాశాల నిబద్ధతతో నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారం దక్కిందని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ పురస్కారం రావడం ఆనందంగా ఉందని తెలియజేశారు.



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి
ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు

గజ్వేల్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు వరించినట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పనితీరులో గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ, అలాగే మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సురేఖ నుంచి ఈ అవార్డును అందుకున్నారు.

రైతు మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

హుస్నాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రైతు మహోత్సవ (కిసాన్ మేళా) కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని మంత్రు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో పాటు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించనున్నారు. మొదటిరోజు నియోజకవర్గంలోని మండలాల నుంచి 5వేల మంది రైతులను 100 బస్సుల్లో తరలించనున్నారు. రెండో రోజు సిద్దిపేట, చేర్యాల డివిజన్‌కు చెందిన 4వేల మంది, మూడవ రోజు ములుగు, గజ్వేల్, దుబ్బాకకు 4వేల మంది రైతులు పాల్గొననున్నారు.

‘సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల బట్టి రామన్నపల్లిలో ఏడాది క్రితం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. పంచాయతీ తరపున వీధి లైటు అమర్చలేదు. గ్రామస్తులు ప్రశ్నించగా తమ వద్ద డబ్బులు లేని పంచాయతీ కార్యదర్శి నుంచి సమాధానం వచ్చింది. దీంతో గ్రామస్తులే సొంత డబ్బులతో వీధిలైటు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ వీధిలైటు కూడా కాలిపోవడంతో చిమ్మచీకట్లలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది’.

‘అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. అయితే వీధిదీపాలు, తాగునీటి పైపులైన్ లీకేజీలు, చెత్తసేకరించే ట్రాక్టర్ డీజిల్, పారిశుధ్యం నిర్వహణ, తాత్కాలిక మరమ్మతుల కోసం ఇప్పటికే గ్రామ కార్యదర్శి తన సొంత డబ్బులు ఖర్చుపెట్టడంతోపాటు అప్పులు చేసినట్లుగా తెలిసింది. దాదాపు రూ. 80వేల దాకా ఖర్చుచేసినప్పటికీ ఆ బిల్లు ఇప్పటికీ రాలేదనే సమాచారం ఉంది’.

‘తొగుటలో 8 మంది పంచాయతీ సిబ్బందికి నిధులు లేక 2నెలలుగా జీతాలు చెల్లించలేదు. తాగునీటి మోటార్లు రిపేరు కావడంతో కార్యదర్శే రూ.30వేలు అప్పుచేసి మరమ్మతులు చేయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వీధిదీపాల కోసం రూ.80వేలు, పైపులైన్ లీకేజీలకు రూ. 15వేలు, ట్రాక్టర్‌లో డీజిల్ పోయించడానికి రూ.1లక్షా 20వేలు సైతం అప్పులతోనే సమకూర్చినట్లు తెలిసింది. విద్యుత్ బిల్లుకు రూ.15వేల బకాయి ఉంది.’

ఊరు.. బేజారు



తొగుటలో సింగిల్ ఫేజ్ మోటార్లను మరమ్మతు చేయిస్తున్న సిబ్బంది

- పల్లెల్లో సమస్యల తాండవం
- నిధులు లేక పరిష్కారానికి నోచని వైనం
- మరమ్మతుల కోసం అప్పులు చేస్తున్న కార్యదర్శులు
- గ్రామాలను సందర్శించేందుకు అధికారులు ససేమిరా
- సమస్యలపై నిలదీస్తారని జంకుతున్న పరిస్థితి
- వీధిదీపాలు, డ్రైనేజీలకు సొంత డబ్బులిస్తున్న ప్రజలు



సిద్దిపేటఅర్బన్ మండలం బట్టి రామన్నపల్లిలో ఏడాదిగా వెలగని స్ట్రీట్‌లైట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 5: "బట్టి రామన్నపల్లి, గోవర్ధనగిరి, తొగుట గ్రామాల్లోనే కాదు. జిల్లాలో ఈ సమస్యలు చాలా పల్లెలను వేధిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో నిధుల విడుదల పూర్తిగా ఆగిపోయింది. పన్నుల రూపేణా వసూలైన డబ్బుతోనే గ్రామాల నిర్వహణ సాగిస్తున్నారు. చాలీచాలని ఈ నిధులతో కష్టతరం అవుతున్నప్పటికీ మరో మార్గం లేకపోయింది. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 509 గ్రామపంచాయతీలుండగా ఒక్కో గ్రామం వెనుక ఒక్కో గాథ దాగి ఉంది."

అప్పులు చేస్తున్న కార్యదర్శులు..

గ్రామాల్లో నెలకొన్న తాత్కాలిక సమస్యలను పరిష్కరించడం కోసం పంచాయతీ కార్యదర్శులు సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు అప్పులు చేసేందుకు వెనుకాడట్లేదు. కార్యదర్శుల్లో రూ.10 వేల నుంచి రూ.5లక్షల దాకా అప్పులు చేసినవాళ్లు లేకపోలేదు. వారు పెట్టిన ఖర్చులకు బిల్లులు కూడా రాకపోవడంతో వడ్డీ పెరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. 2024 ఫిబ్రవరితోనే గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ నడుస్తోంది. కాగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయి. పంచాయతీలకు పన్నుల రూపేణా వసూలయ్యే ఆదాయమే దిక్కయింది. ఇది కూడా చాలకపోవడంతో కార్యదర్శుల పైనే భారం పడుతోంది. మళ్లీ ఎన్నికలు జరిగితేనే పంచాయతీలకు అభివృద్ధి నిధులు మంజూరవుతాయి.

కానరాని అధికారులు

పల్లెల పర్యవేక్షణ కోసం నియమించిన ప్రత్యేకాధికారుల్లో చాలామంది అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలున్నాయి. కొందరు మాత్రం టంచన్‌గా గ్రామ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకాధికారుల సంగతి పక్కనబెడితే ఉన్నతాధికారులూ సైతం పల్లెల్లో పర్యటించడం లేదు. అభివృద్ధి నిధుల కొరత ఉన్నందున నిలదీతలు ఉంటాయనే నెపంతో అధికారులూ వెనుకంజ వేస్తున్నట్లుగా అర్థమవుతోంది. దీంతో ఎక్కడికక్కడ సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామాల్లో ఆరు గ్యారంటీల అమలు, ఇతర పథకాలపై కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ.. స్థానికంగా ఉన్న సమస్యలను మాత్రం విస్మరిస్తున్నారు.

ఎన్నికలతోనే పరిష్కారం..

ప్రస్తుత సమస్యలు పరిష్కారం కావాలంటే గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది. నిత్యం పారిశుధ్యం నిర్వహణ, చెత్తసేకరణ, నీటిసరఫరా, ట్రాక్టర్ డీజిల్, కార్మికుల వేతనాలు,

మిగతా 8వ పేజీలో

ఆంధ్రజ్యోతి విజిట్



నంగునూరు మండలం ముండ్రాయి ఎస్సీ కాలనీలో నిధులు లేక నిలిచిన మురుగుకాలువ పనులు

పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేయాలి

- అలస్యమైతే లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు
- ఈ నెల 30 వరకు బియ్యం పంపిణీ : కలెక్టర్

హుస్నాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో జరుగుతున్న అలస్యానికి లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని ఈనెల 30 వరకు రేషన్ బియ్యం అందిస్తారని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. గురువారం హుస్నాబాద్ మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం మహ్మదాపూర్‌లోని రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం కోటా ఎంత, పంపిణీ జరిగింది ఎంత? పంపిణీలో బయోమెట్రిక్ ద్వారా తలెత్తుతున్న ఇబ్బందులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఒక్కో లబ్ధిదారుడికి రేషన్ అందించేందుకు 20 నిమిషాలకు పైన ఆలస్యమవుతుందని రోజుకు 20 మందికి కంటే ఎక్కువ పంపిణీ జరగడం లేదని డీలర్ కలెక్టర్‌కు వివరించారు. సాంకేతిక కారణాల వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో రేషన్ అందించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో రామ్మూర్తి, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రుక్మిణీ, ఆర్ఐ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.



మహ్మదాపూర్‌లో రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో జరుగుతున్న రైతు మహోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునిక పద్ధతులు తెలుసుకుని అధిక దిగుబడులు సాధించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహోత్సవానికి రైతులే కాకుండా ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజింగ్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాలల నుంచి ప్రొఫెసర్లు, సంబంధిత కంపెనీల ప్రతినిధులు వ్యవసాయ, వాటి అనుబంధ రంగాల అధికారులు ఇందులో పాల్గొంటున్నారని తెలిపారు. దాదాపు 2 వేల మంది కూర్చునే విధంగా సీటింగ్, ఏసీ సౌకర్యం, ఎల్ఈడీ స్క్రీన్స్ ప్రత్యేకం గా సిద్ధం చేసిన రైన్ ప్రూఫ్ జర్మన్ హంగర్ టెంట్ ఏర్పాటు చేశామన్నారు.



కల్యాణోత్సవంలో కూర్చున్న దంపతులు

వైభవంగా సువర్చల హనుమత్ కల్యాణం

సిద్దిపేట కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మార్కెట్ చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సువర్చల హనుమత్ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన ఉత్సవం మన్యుసూక్త మహాభిషేకం, అర్చన, హోమాలతో సాగింది. అనంతరం పట్టణంలో స్వామివారి విగ్రహాలను ఊరేగింపు (శావా) నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. ప్రముఖ వేద పండితులు శేష ఫణి మాట్లాడారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఉత్సవంలో బ్రహ్మశ్రీ అరవపల్లి రఘురామశర్మ, ఆలయ ఈవో రవికుమార్ శర్మ, మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఆలయ పూజారి రాం బహదూర్ ద్వివేది, ఉత్సవ నిర్వాహకులు పారుపల్లి ఈశ్వర్ చరణ్, పజ్జురి హరి, బాల మల్లేశం, ఆత్మరాములు, నరేష్, ధర్మపురి, చింత రాము, శ్రీధర్, గందె ఎల్లేష్, కటకం మోనయ్య తదితరులు పాల్గొన్నారు.



సువర్చల హనుమత్ కల్యాణ్యాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఉజ్వల భవితకు ‘నవోదయ’ం

- ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- చివరి తేదీ ఈ నెల 29, ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న

7



అడిగినంత ఇస్తేనే సర్టిఫికెట్

- మీ సేవ కేంద్రాల్లో దోపిడీ ఇష్టారాజ్యంగా వసూళ్లు
- అధికారులతో కుమ్మక్కై పనులు

7

ఎస్సీ గురుకులాల్లో ఫోన్ సేవలు

- ఈ విద్యా సంవత్సరం నుంచే ఫోన్ మిత్ర కార్యక్రమానికి శ్రీకారం

సంగారెడ్డి అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తమ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వీలుగా సర్కారు ఓ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ‘ఫోన్ మిత్ర’ కార్యక్రమం పేరిట ఫోన్లు ఏర్పాటు చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉగాది బాలల కథల పోటీ 2025 ఫలితాలు వెల్లడి

సిద్దిపేట కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సుగుణ సాహితి సమితి సిద్దిపేట ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉగాది బాలల కథల పోటీలు 2025 ఫలితాలను గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా సుగుణ సాహితి సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 372 కథలు వచ్చాయని తెలిపారు. కథల పోటీకి న్యాయనిర్ణేతగా ప్రముఖబాలసాహితీవేత్త, పుస్తక సమీక్షకులు కందుకూరి భాస్కర్ వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణారెడ్డి సౌజన్యంతో జూన్ చివరి వారంలో నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలైన బాల కథకులకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని కన్వీనర్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 21 ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రతిభ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీవీరావు, బాల సాహితీవేత్త పెందోట వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కథల పోటీల విజేతల వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

వేడుకలా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

8

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

సిద్దిపేట క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ వర్కోలు పరంధాములు కుటుంబ సభ్యులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజ్ స్కీం కింద కోటి రూపాయల చెక్కును గురువారం సీపీ అనురాధ ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మారుతి వారి బృందం కమిషనర్ కార్యాలయంలో అందజేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్ శాలరీ ప్యాకేజ్ కింద సంబంధిత బ్రాంచ్‌కు వెళ్లేప్పుడు మూడు నెలల పే స్లిప్పులు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, జీరాక్స్ కాపీలను తీసుకెళ్లి అకౌంట్‌లోకి మార్చుకోవాలని సూచించారు. అనంతరం సీపీ మాట్లాడారు. జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది వారి శాలరీ అకౌంట్‌ను పోలీస్ శాలరీ ప్యాకేజీలోకి మార్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, పలువురు పాల్గొన్నారు.



పరంధాములు కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్

బైక్ పై నుంచి పడి కోమాలోకి బాలిక

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బైకుపై ప్రయాణిస్తూ ఓ బాలిక కిందపడి తీవ్రమైన గాయాలై కోమాలోకి వెళ్లింది. బుధవారం రాత్రి రామాయంపేట పాత హైవేపై ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట ప్రాంతానికి చెందిన బాలిక మరో ఇద్దరు యువకులతో కలిసి బైక్ పై ప్రయాణిస్తుంది. రామాయంపేట శివారులో ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోగా ఆమెకు బలంగా దెబ్బలు తగిలాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రస్తుతం బాధితురాలు కోమాలోకి వెళ్లినట్లు గ్రామస్థులు ద్వారా తెలిసింది.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి


మృతి చెందిన తిరుపతి (ఫైల్ ఫొటో)

సిద్దిపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చింతమడక గ్రామ పంచాయతీ పరిధిలోని అంకంపేట గ్రామంలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముత్యాల తిరుపతి (55) వ్యవసాయంతో పాటు గొర్రెలను మేపుకుంటూ జీవించేవాడు. రోజూలాగే ఉదయం గొర్రెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పక్క పొలంలోని చింత చెట్టుకు ఉన్న తేనెటీగలు అతనిపై దాడి చేసి, ముఖం, శరీరంపై కుట్టడంతో కింద పడిపోయాడు. విషయం తెలుసుకున్న తిరుపతి కొడుకు రాజు అతడిని సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, పరీక్షించిన డాక్టర్లు అతడు అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న కారు


ప్రమాదంలో ధ్వంసమైన కారు ముందు భాగం

చిన్నకోడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనగా ఒకరికి తీవ్రమైన గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సోమ రాజయ్య, శివ, అనూష, మేఘన, మరొకరు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి కారులో ఓ ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా రామునిపట్ల శివారులోకి రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమై కారులో ఉన్న రాజయ్యకు తీవ్రమైన గాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. రాజయ్యను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పుల్‌కల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌కు చెందిన కావేరి అనే మహిళ బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పుల్కల్ ఎస్సై తెలిపారు. అందోల్ మండలం సంగుపేటకు చెందిన కావేరికి చౌట్కూర్‌కు చెందిన పోచయ్యతో గత సంవత్సరం వివాహం జరిగింది. వివాహం అనంతరం పలుమార్లు గర్భ స్రావం కావడం, అత్తామామలు వేధించడంతో మనస్తాపానికి గురైన కావేరి బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

పాపన్నపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అంబులెన్సులో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొడుపాక గ్రామానికి చెందిన దీపికకు బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ప్రసవం కోసం మెదక్ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి తరలిస్తుండగా నాగ్సాన్‌పల్లి శివారులోకి రాగానే దీపికకు ప్రసవం జరిగి ఆడబిడ్డకు జన్మించింది. అనంతరం ఈఎంటీ సతీష్, పైలట్ దుర్గాప్రసాద్‌లు వారికి అవసరమైన సేవలు అందించి ఆస్పత్రిలో చేర్పించారు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం హెల్పర్ మృతి


న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో

చిన్నశంకరంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీఎం క్లీనర్ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామంలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం సూరారం గ్రామ శివారు ఓ పరిశ్రమలో చాకలి యాదగిరి (42) హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. పరిశ్రమకు సంబంధించిన పనిపై హైదరాబాదుకు డీసీఎం వాహనంలో బయలుదేరాడు. ప్రమాదవశాత్తు రోడ్డుపై నిలిపి ఉన్న ట్రక్కును ఢీకొట్టడంతో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరికి భార్య మంజుల, ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకులు, బంధువులు మృతుడి కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. మృతుడి బంధువులు పరిశ్రమ యజమాన్యం పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆగ్రహావేశాలకు గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బంధువులను శాంతింపజేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


షేక్ అబ్దుల్ నబీ (ఫైల్ ఫొటో)

కౌడిపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మపూర్ గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ నబీ (27) కొంత కాలంగా మెదక్‌లోని అర్‌డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు . గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై మెదక్ బయలు దేరాడు. కౌడిపల్లిలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలోనికి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే విషయంపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్..

కొండాపూర్,జూన్5(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి చెందింది. ఈ సంఘటన కొండాపూర్ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు మునిదేవునిపల్లి చెందిన దేవరంపల్లి రేణుక(58) 23 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఏడాది క్రింతం నుంచి క్యాన్సర్ బారిన పడింది. వారం రోజులకు ముందు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. గురువారం చికిత్స పొందుతూ తీవ్రమైన అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుంటుబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. రేణుక మృతి పట్ల మండల అంగన్‌వాడీ టీచర్ల సంఘం నాయకురాలు ఏసుమణి, అరుణలు ప్రగాడ సానుభూతి వ్యక్త పరుస్తూ సంతాపాన్ని ప్రకటించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి..

సిద్దిపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌కు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి బాలకృష్ణ (36) కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. కాగా రోజూలాగే పనికి వెళ్లిన బాలకృష్ణ సిద్దిపేట నుంచి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో రామచంద్రనగర్‌కు వస్తుండగా, బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను గుద్దుకొని కింద పడిపోయాడు. స్థానికులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధ్యాగల కుమార్ (30) బుధవారం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. గురువారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్న కుమార్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే భార్య స్రవంతి చుట్టు పక్కల వారి సహాయంతో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రిలో మృతి

వెల్దుర్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరి గ్రామానికి చెందిన ఇక్కిరి యాదగిరి (41) మద్యానికి బానిసై మే31న తన భార్య స్వరూపను మద్యం తాగడానికి డబ్బులు అడగగా, పంట డబ్బులు వచ్చిన తరువాత ఇస్తానని చెప్పడంతో తనతో గొడవ పడ్డాడు. అదే రోజు మధ్యాహ్నం యాదగిరి పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున యాదగిరి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

హవేళిఘణపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసైన కొడుకును తల్లి మందలించగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం సర్దన గ్రామానికి చెందిన ఎండీ సర్దార్-బీబీపాషా దంపతులకు ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన ఎండీ సల్మాన్ (24) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం సల్మాన్ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి రాకపోవడంతో తల్లి బీబీ పాషా సరిగా పనులు ఎందుకు చేయడం లేదని మందలించింది. దీని వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన సల్మాన్ గదిలోకి వెళ్లి దూలానికి చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలోకి వెళ్లి చాలా సేపైందని గది తలుపులు తట్టగా రాలేదు. దీంతో కిటికి నుంచి చూడగా దూలానికి వేలాడుతున్నాడు. తండ్రి సర్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు. పంచనామ నిర్వహించి పోస్టుమార్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

వరద కాలువలతో మురుగు సమస్యలు

రామచంద్రాపురం టౌన్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖకు చెందిన వరదకాలువలతో మురుగు సమస్యలు పెరుగుతున్నాయని కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు గురువారం జరిగిన జీహెచ్ఎంసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాతరామచంద్రాపురం నుంచి మల్లికార్జున్‌నగర్ కాలనీవరకు వరదకాలువలు సమస్యగా మారి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. శుభ్రత ఎప్పటికప్పుడు చేయించాల్సి ఉంటుందని వివరించారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు.



మంత్రి సీతక్కతో సంగారెడ్డి జిల్లా అధికారులు

మేధో మథన సదస్సులో అధికారులు

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఈ నెల 4, 5వ తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన మేధో మథన సదస్సుకు సంగారెడ్డి జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన వారిలో జిల్లా మహిళా సంక్షేమాధికారి లలితకుమారి, సీడీపీవోలు చంద్రకళ, ప్రియాంక, సూపర్‌వైజర్లు మణెమ్మ, కవిత, విమల, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సౌమ్యలు ఉన్నారు. వారు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు.

కుళ్లిన గుడ్ల సరఫరాపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హత్నూర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధుర అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసిన విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి గ్రామానికి వెళ్లి అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వం పోషకాహారం కింద పంపిణీ చేస్తున్న గుడ్లు కుళ్లినవి ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టర్‌ను తొలగించి, ఇకమీదట ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని గర్భిణులు, తల్లులు కోరారు. దీంతో సూపర్‌వైజర్ స్పందిస్తూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు, తాను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ సుగుణ తదితరులు ఉన్నారు.

పశు సంచార వాహన సిబ్బంది వేతన వెతలు

3 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు



మెదక్ కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పశు సంచార వాహన సేవలు అందిస్తున్న సిబ్బంది గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నర్సాపూర్, మెదక్‌లో ఒక్కొక్క వాహనం ద్వారా సేవలు అందిస్తున్నారు. ఇందులో 8 మంది సిబ్బంది ఉన్నారు. ఈ వాహనంలో (1962) పశు సంచార వాహనంలో పశువుల వైద్యుడు/ వైద్యురాలు, పారా మెడికల్ సిబ్బంది, వాహన డ్రైవర్ ఉంటారు. రోజూ మూగ జీవాలకు ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తుంటారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నా వచ్చే జీతం నెల నెల రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా జీతాలు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

ఘనంగా సాయిబాబా దత్తాత్రేయ స్థిర ప్రతిష్ఠ


ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న విశ్వంజీ మహారాజ్

శివ్వంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని గురుపీఠంలో గురువారం సాయిబాబా దత్తాత్రేయ విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. విశ్వయోగి విశ్వంజీ మహారాజ్, గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకులు జిన్నారం పెద్దగొని రమాదేవి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులు శాస్త్రుల వామనశర్మ సమక్షంలో విగ్రహ స్థిర ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠ, అష్ట బంధన జీవన్యాసం, కుంభాభిషేకం పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వసలహాదారులు వేణుగోపాల్ దంపతులు, సీఎంవో మాజీ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు దంపతులు, టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గ్రంథాయల సంస్థ చైర్‌పర్సన్ సువాసిని రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. అలాగే, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ట్రస్ట్ సభ్యులు రమణ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టు సభ్యులు బిక్షపతి యాదవ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ మహేష్ గుప్తా పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌లకు సన్మానం


డ్రైవర్ కండక్టర్‌ను అభినందిస్తున్న ఎండీ వీసీ సజ్జనార్

గజ్వేల్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్‌లను సంస్థ ఎండీ సజ్జనార్ అభినందించారు. ఇటీవల జగదేవ్‌పూర్ వద్ద ఓ ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన నగదు, బంగారాన్ని కండక్టర్ ఎల్. ఓంప్రకాష్, డ్రైవర్ ఎస్‌డి సలీంలు గుర్తించి, వాటిని తిరిగి ప్రయాణికుడికి అందజేశారు. విషయం తెలుసుకున్న టీజీఎస్ ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం డిపో మేనేజర్ పవన్, డ్రైవర్, కండక్టర్లను అభినందించి వారిని ఘనంగా సన్మానించారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అల్లాదుర్గం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాందాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెల్లవారుజామునుంచే పురోహితులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులతోపాటు రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతితో పాటు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి లలితాంబిక దేవి ప్రతిష్ఠాపన ఉత్సవాలు...

నారాయణఖేడ్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని మనూరు క్రాస్‌రోడ్స్ వద్ద నిర్మించిన లలితాంబిక దేవి ఆలయంలో ఈనెల 6 నుండి 8 వరకు ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు దేవి ఉపాసకులు శివపంతులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉజ్వల భవితకు 'నవోదయ'ం

ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ - చివరి తేదీ ఈ నెల 29, ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13న

వర్గల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నత ప్రామాణాలతో కూడిన అధునాతన విద్యను అందించడం, వారిలో ఉత్తమ విలువలను పెంపొందించడంతో పాటు క్రీడలు, వ్యాయామ విద్యలో సమున్నత శిక్షణను నివ్వడం నవోదయ విద్యాలయం ప్రత్యేకత. అంతర్జాతీయ విద్యాలయాల తరహాలో చదువులతో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ, వ్యక్తిత్వ వికాసం ఇక్కడ చదువులో బాగం చేశారు. 6వ తరగతి నుంచి 12 తరగతి వరకు నామమాత్రపు ఫీజులతో విద్యాబోధన సాగుతుంది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తారు. దీంతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ బాషల పట్ల విద్యార్థులకు మంచి పట్టు లభిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో 6వ తరగతిలో చేరడానికి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్) జిల్లాలకు కలిపి 80 మంది విద్యార్థులకు మాత్రం ప్రవేశాలు ఉంటాయి.

సీబీఎస్ఈ సిలబస్

నవోదయలో సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన చేస్తారు. పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ సదుపాయాలు ఉంటాయి. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంపొందించేందుకు మైగ్రేషన్ విధానంలో విద్యార్థులను ఏడాది పాటు హిందీయేతర రాష్ట్రాలనవోదయలకు పంపుతారు. ఈ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ విధానం అమలులో ఉంది. చదువులతో పాటు ఆటలు, పాటలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నవోదయ ఎంతో కృషి చేస్తుంది. రాష్ట్రంలో ఏ నవోదయలో లేని విధంగా మన నవోదయ విద్యాలయంలో 400 మీటర్ల ట్రాక్‌తో కూడిన స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, జీమ్ ఏర్పాటు చేశారు. ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఆటలలో తర్ఫీదునిచ్చేందుకు నియమితులయ్యారు. సంగీత శిక్షణ కోసం మ్యూజిక్ టీచర్, డ్రాయింగ్‌లో ప్రావిణ్యత పెంచేందుకు డ్రాయింగ్ టీచర్ ఉన్నారు. అత్యవసర వైద్య సేవలకు గాను స్టాఫ్ నర్స్, హెల్త్ సెంటర్ ఉన్నాయి.



ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ డబ్లూడబ్లూడబ్లూ. నవోదయ. జీవోవి. ఇన్‌లో తగిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి పాస్ పోటో, సంతకం అప్లోడ్ చేయవలసి ఉంటుంది. వాటితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో ధ్రువీకరణ తప్పనిసరి. ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. డిసెంబర్ 13న రెండో మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 80 సీట్లుకు గాను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం, పట్టణ విద్యార్థులకు 25శాతం సీట్లు రిజర్వు చేస్తారు. అందులో దివ్యాంగులకు 3శాతం, షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తెగలకు 7 శాతం కనీస రిజర్వేషన్ ఉంటుంది. మొత్తంలో బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వు చేస్తారు. ఎంపిక పరీక్షలో 50 శాతం మేధాశక్తి, 50 శాతం గణితం, భాష సామర్థ్యంకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉండే ప్రశ్నలకు రెండు గంటల్లో సమాదానాలు గుర్తించాలి.

విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లాలోనే నివాసం ఉండాలి. చదువుతున్న జిల్లాలోనే 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదో తరగతి చదువుతూ ఉండాలి. మూడు, నాలుగు తరగతులు పూర్తి విద్యాసంవత్సరం చదివి ఉత్తీర్ణులై ఉండాలి. తేది 1-5-2014 నుంచి 30-7-2016 తేది మధ్య జన్మించి ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థి రెండోసారి ప్రవేశ పరీక్ష వ్రాసెందుకు అనుమతి లేదు.



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి జవహర్ నవోదయ విద్యాలయాలు కృషి చేస్తున్నాయి. నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, విశాలమైన క్రీడా మైదానం, స్మార్ట్ క్లాస్‌రూమ్, కంప్యూటర్ విద్యతో పాటు అన్ని వసతులు ఉన్నాయి. విద్యతో పాటు విద్యార్థికి ఆసక్తి కనబరిచే క్రీడా, సాంస్కృతిక విభాగం, చిత్రలేఖనంతోపాటు తదితర విషయాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆరో తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే చివరి తేదీ జూలై 29, పూర్తి వివరాల కోసం నవోదయ వెబ్ సైట్‌ను సందర్శించాలి.

-దాసి రాజేందర్, ప్రిన్సిపాల్,
జవహర్ నవోదయ పాఠశాల, వర్గల్

గోమాతలను రక్షిస్తే కేసులా.?

ధర్మప్రసార్ రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్ చందర్


సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గోమాతలను రక్షిస్తే కేసులు బనాయిస్తారా, ఇదెక్కడి న్యాయమని ధర్మప్రసార్ రాష్ట్ర కో కన్వీనర్ సుభాష్ చందర్ ప్రశ్నించారు. గోమాతలను రక్షించిన హిందూ బాంధవులపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది టన్నుల గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, గోవును కాపాడేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 1977లో చట్టం తీసుకువచ్చిందని, ప్రస్తుతం తెలంగాణలో ఈ చట్టం అమలులో ఉన్నా చట్టవిరుద్ధంగా రాష్ట్రంలో గోవధ విచ్చలవిడిగా జరుగుతుందని అన్నారు. గోరక్ష సంస్థలు గోవులను కాపాడే ప్రయత్నం చేస్తే వారిపైనే దాడులు చేస్తూ కేసులు బనాయించడం దారుణమన్నారు. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గో వధశాలలను వెంటనే మూసివేయాలాని డిమాండ్ చేశారు. గుర్తింపు పొందిన గోశాలలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వమే గోశాలలను ఏర్పాటు చేయాలన్నారు. గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు, గోపోషకులకు ప్రోత్సాహకాలందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పవన్, రాష్ట్ర నాయకులు బ్రహ్మానందం గౌడ్, జిల్లా నాయకులు ప్రకాష్, రవి, బజరంగ్ దళ్ నాయకులు ప్రభుగౌడ్, సురేష్, మనోజ్, లక్ష్మణ్, తరుణ్, వెంకట్, సృజన్, బీజేపీ నాయకులు మాణిక్‌రావు, నాగరాజు, ద్వారక రవి, వాసు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి వినతిపత్రం

సంగారెడ్డి క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోరక్ష చట్టాలు కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ నాయులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులను పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు గోరక్షకులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా ఎస్పీని కోరారు.

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో

వడక్‌పల్లి, జానకంపేట

రికార్డులు స్వాధీనం చేసుకున్న మున్సిపల్ కమిషనర్

అమీన్‌పూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడక్‌పల్లి, జానకంపేట గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి రెండు గ్రామపంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గతంలోనే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, పటేల్‌గూడా, దాయర, ఐలాపూర్, ఐలాపూర్ తండా గ్రామ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో మండల పరిధిలోని వడక్‌పల్లి, జానకంపేట గ్రామాలు మాత్రమే పంచాయతీలుగా మిగిలిపోయాయి. కేవలం మూడు ఎంపీటీసీ స్థానాలతో రాష్ట్రంలోనే అతి చిన్న మండల పరిషత్‌గా అవతరించాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రాజకీయ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు గ్రామ పంచాయతీలు, మూడు ఎంపీటీసీ స్థానాలతో ఎంపీపీ, ఒక జడ్‌పీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయడంపై అంతా ముక్కున వేలేసుకున్నారు. మండలంలో మిగిలిన రెండు పంచాయతీలను సైతం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి సైతం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీంతో దిగివచ్చిన అధికారులు అమీన్‌పూర్ మండల పరిషత్, పంచాయతీలను రద్దు చేస్తూ అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ గజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో పంచాయతీలు లేని మండలంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ అవతరించింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీపీఓ ప్రవీణ్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మెదక్ కోర్టు ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ


సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి

మొక్కలు నాటిన న్యాయాధికారులు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా గురువారం మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నీలిమకోర్టు ఆవరణలో మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో సెక్రటరీ, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి సుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి రుబీనాఫాతిమా, జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి కె.జయంతి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయాధికారి పీపీ కృష్ణార్జున, మూడో అదనపు జిల్లా న్యాయాధికారి సునీత రవీంద్రారెడ్డి, నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి లావణ్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి తేజో కార్తీక్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి అనిత, జూనియర్ సివిల్ జడ్జి టి. దుర్గా రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం టౌన్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు. ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, కులధ్రువీకరణ, ఆధార్‌కార్డు, అభ్యర్థి ఫోటోలను ఆన్‌లైన్‌లో ఈనెల 21 తేదీ లోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థి ఫోన్ నంబర్, మెయిల్ ఐడీతో రిజిస్టర్ అవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన తరువాత ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వస్తుందని వివరించారు. ఏడు విభాగాల్లో 172 సీట్లు ఉన్నాయని చెప్పారు. కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 48, ఎలక్ట్రికల్, ఫిట్టర్, మెషనిస్ట్, టర్నర్, వెల్డర్ విభాగాల్లో 20 చొప్పున సీట్లు ఉండగా మెకానిక్ మోటారు వెహికల్ విభాగంలో 24 ఖాళీలు ఉన్నాయి. వీటిని రిజర్వేషన్‌ల నిబంధనలకు అనుగుణంగా ఖాళీలు భర్తీ చేస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

అడిగినంత ఇస్తేనే సర్టిఫికెట్

మీ సేవ కేంద్రాల్లో దోపిడీ
ఇష్టారాజ్యంగా వసూళ్లు
అధికారులతో కుమ్మక్కై పనులు



పటాన్‌చెరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఏ ధ్రువపత్రం కావాలన్నా మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్లాల్సిందే. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దరఖాస్తుదారులను దోచుకుంటున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ధ్రువపత్రాలు పొందేందుకు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి సేవకు కొంత రుసుమును నిర్ణయించింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఇటీవల ప్రభుత్వం కొత్తగా మీ సేవ కనెక్ట్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఇదివరకు ఉన్న టీ యాప్ ఫోలియోను పేరు మార్చి మీ సేవ యాప్‌ను ప్రారంభించింది. దీనిలో మీ సేవ కేంద్రాలలో అందిస్తున్న సేవలన్నీ పొందే వెసులుబాటు కల్పించింది. దాని ప్రకారం నిర్వాహకులకు కమీషన్ రూపంలో కొంత చెల్లిస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయం, పోలీసు, విద్య, వైద్యం, విద్యుత్ ఇలా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 300లకు పైగా పౌర సేవలను మీ సేవ కేంద్రాలలో పొందే వెలును బాటు కల్పించారు. తాజాగా మరో తొమ్మిది సేవలను అమల్లోకి తెచ్చారు.

దరఖాస్తుకో ధర

పలు రకాల ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లిన ప్రజలకు పలువురు మీసేవ నిర్వాహకులు దరఖాస్తుకో ధర చెప్తూ ప్రజలను భారీగా దోచుకుంటూ, రెవెన్యూ, మున్సిపల్ తదితర ప్రభుత్వ యంత్రాంగాలకు దళారులుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని రకాల సర్టిఫికెట్లకు ఒక్కో ధరను చెపుతూ సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్ తదితర ప్రభుత్వ కార్యాలయాలలో పలువురు ఉద్యోగులతో సంబంధాలు కొనసాగిస్తున్న పలువురు మీసేవ నిర్వాహకులు ప్రజల నుంచి దోచుకున్న సొమ్మును కొంతమేర వారికి అందిస్తూ పనులు యథేశ్ఛగా కానిచ్చేస్తున్నారు. దీంతో వీరు చెప్పినట్టు డబ్బు చెల్లించకపోతే వారి దరఖాస్తులు ఎక్కువ శాతం రిజెక్ట్ అవుతున్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. పలువురు మీసేవ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొన్ని రకాల సర్టిఫికెట్ల కోసం నోటరీ సమర్పించాల్సి ఉండగా, నోటరీ బాండ్లు కూడా నిబంధనలకు వ్యతిరేకంగా మీ సేవ నిర్వాహకుల వద్ద రెడీగా ఉండటంతో నోటరీ ధరలు కూడా బాండు ధరను మించి అధికంగా వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు కుల ఆదాయ, పుట్టిన రోజు ఇతర ధ్రువపత్రాల కోసం రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మీసేవ నిర్వాహకులు చెప్పినట్లు డబ్బులు చెల్లించిన వారికి తొందరగా సర్టిఫికెట్లు వస్తున్నాయని పలువురు ఆరోపించడం గమనార్హం. వీళ్ల చెప్పినట్లు డబ్బులు చెల్లించని వారి దరఖాస్తులను తమ వద్ద కాదంటూ వెనక్కు పంపించడం పలు మీ సేవ కేంద్రాల్లో పరిపాటిగా మారింది.

పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం రూ. 3 వేలు

విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో ఆధార్ కార్డు కోసం తన కుమార్తెలకు పుట్టినరోజు సర్టిఫికెట్ అవసరం అయింది. గతంలో మూడువేలు ఇచ్చి చేయించాను. అందులో తల్లిదండ్రుల ఇంటి పేర్లు రాలేదు. దాన్ని సరిదిద్దటానికి మళ్లీ మూడు వేలు అడుగుతున్నారు. ఇళ్లల్లో పని చేసుకునే నాకు ప్రతీ సారి అంత ఇవ్వాలంటే సాధ్యం అవుతుందా?

-సంధ్య, బాధితురాలు

అక్రమంగా వసూలు చేస్తే చర్యలు

మీ సేవ కేంద్రాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు. ఇస్నాపూర్‌లో ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా డబ్బులు వసూలు చేస్తున్న ఒక మీ సేవ కేంద్రం పై ఇటీవలే చర్యలు తీసుకున్నాం. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. మీసేవ కేంద్ర నిర్వాహకులతో కలిసి రెవెన్యూ సిబ్బంది ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం.

- రంగారావు, తహసీల్దార్, పటాన్‌చెరు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న దృశ్యం



సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సర్కిల్ వద్ద 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్


కొండపాక: మర్పడగలో మహిళలు తయారు చేసిన మోదుగు ఆకుల విస్తర్లను పదర్శిస్తున్న అధికారులు, రైతులు

వేడుకలా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


హుస్నాబాద్‌లో మొక్కలు నాటుతున్న మహిళలు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సిద్దిపేట జిల్లాలో గురువారం వేడుకలా నిర్వహించారు. విద్యా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. సిద్దిపేట పురపాలక సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి సహకారంతో పట్టణంలో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ సర్కిల్ వద్ద 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల్లో పంచాయతీశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో విస్తరాకులను ఉపయోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని అవగాహన కల్పించారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు.

- న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):


నారాయణరావుపేట: మోదుగు ఆకులతో విస్తర్ల తయారీపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూడవెల్లి రామలింగేశ్వరాలయం ఈవోగా శ్రీధర్‌రెడ్డి


ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరం పల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం నూతన కార్యనిర్వహణాధికారిగా శ్రీధర్‌రెడ్డి గురువారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పని చేసిన విశ్వనాథ శర్మ నాలుగు రోజుల క్రితం పదవీ విరమణ పొందారు. ఆరేళ్లపాటు విశ్వనాథశర్మ ఆలయంలో సేవలందించారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కు పరామర్శ


మురళిని పరామర్శిస్తున్న కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు

సిద్దిపేట రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఇటీవల పీఏసీఎస్ డైరెక్టర్ ఒగ్గు మురళి తల్లి మరణించింది. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు మురళి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం తిరుపతి రెడ్డి, బిఆర్ఎస్ నాయకులున్నారు.

దివ్యాంగుల కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాలి


ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

హుస్నాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో సమస్యలను విన్నవించే క్రమంలో కార్యాలయ మెట్లు ఎక్కేందుకు దివ్యాంగులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యాలయంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా లిఫ్ట్ లేదా ర్యాంపును ఏర్పాటు చేయాలని ఆర్డీవోకు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంపత్, మహిళా అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి నవీన్‌రెడ్డి, శ్రీను, రాజు ఉన్నారు.

మర్పడగ లో రెవెన్యూ సదస్సు

కొండపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ రైతు వేదికలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్యామ్ గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలో 89 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. డీటీ లావణ్య, ఆర్ఐ బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు.

యూరియా వినియోగాన్ని తగ్గించాలి


కొండపాక: దుద్దెడ రైతు వేదికలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి

కొండపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించి అవసరం మేరకు వేసి నెలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వ్యవసాయ పరిశోధనాసంస్థ శాస్త్రవేత్తలు శ్వేత, సతీష్ రైతులకు సూచించారు. కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలో వ్యవసాయ పరిశోధనాసంస్థ, వ్యవసాయశాఖవారి ఆధ్వర్యంలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు' అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. పంట మార్పిడి ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు జనుము, జీలుగా విత్తన లభ్యత, వ్యవసాయ శాఖ వారు అందించే సబ్సిడీలను వివరించారు. మండల హార్టికల్చర్ అధికారి కౌసల్య కూరగాయల పద్ధతోటల సాగు, దానిలో మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పరశురాం పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● **కొమురవెల్లి:** మండలంలోని అయినపూర్ గ్రామంలో గురువారం వానాకాలం పంటల సాగుపై,అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల రకాలు, పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం తునికి అధ్వర్యంలో శాస్త్రవేత్తలు డా.రామనాయుడు,డా.జి.భార్గవి, మెట్ట పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డా.గిరిజవేణి, డా.రమేష్‌నాయక్, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ ఇంటికి సరిపడే అన్ని రకాల కూరగాయలను, పప్పు దినుసులను కుడా సేంద్రియ పద్దతిలోనే సాగు చేయాలని, దాని ద్వారా కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు రవళి, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యోగాతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం

తొగుట, జూన్ 5(ఆంధ్రజ్యోతి); విద్యార్థుల్లో శారీరక పటుత్వం, మానసిక ఉల్లాసానికి యోగా ప్రత్యేక శిక్షణ శిబిరం దోహదపడుతుందని జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ బేతి భాస్కర్ అన్నారు. గురువారం తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వేసవి ప్రత్యేక శిబిరంలో ఇతర అంశాలతో పాటు యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యకుమార్, బాల భాస్కర్ పాల్గొన్నారు.


పెద్దమాసాన్‌పల్లి పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థుల యోగా ప్రదర్శనను పరిశీలిస్తున్న బేతి భాస్కర్

వేలాడుతున్న వైర్లను సరిచేసిన అధికారులు



ఆయిల్ పామ్ తోటలో వైర్లను సరి చేస్తున్న విద్యుత్ సిబ్బంది , అంతకు ముందు చేతికి అందేలా ఉన్న దృశ్యం

దౌల్తాబాద్,జూన్ 5 ఆంధ్రజ్యోతి): చేతికి అందేలా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి సంబంధిత విద్యుత్ అధికారులు గురువారం స్పందించారు. వివరాల్లోకి వెళ్తే..మండల కేంద్రానికి చెందిన సయ్యద్ రహీమోద్దీన్‌కు చెందిన ఆయిల్ పామ్ తోటలో వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. గత ఆదివారం ఆయిల్‌పామ్ తోటలో భార్యభర్తలు పని చేస్తుండగా ఆయిల్‌పామ్ చెట్టుకు వేలాడే వైర్ల కారణంగా చెట్టుకు ఎర్తింగ్ వచ్చి భర్త గనియా విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిపాలయ్యాడు. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ఈ విషయమై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు, విద్యుత్ అధికారులు ఆయిల్‌పామ్ తోట మధ్యలో విద్యుత్ స్తంభం వేసి వేలాడుతున్న వైర్లను సరి చేశారు.

రెండోసారి పాదుపు సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి

కోహెడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి పురుషుల పొదుపు సంఘం 24వ మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక నివేదికను అధ్యక్షుడు కంది సత్యనారాయణరెడ్డి ప్రవేశపెట్టారు. గణకులు దోనపటి విష్ణువర్ధన్‌రెడ్డి సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. దీనికి సమితి అధ్యక్షుడు పిల్లి ప్రభాకర్, వింజపల్లి సంఘం అధ్యక్షులు భూమయ్య ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నూతన చైర్మన్, నలుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదుపు సంఘం అధ్యక్షుడిగా 2వ సారి కంది సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా దానబోయిన రాజు, డైరెక్టర్లుగా గుజ్జ శ్రీనివాస్‌రెడ్డి, తోట రాజ్‌కుమార్, దానబోయిన శరత్, సత్తిరెడ్డి ఎన్నికయ్యారు.


నియామకపత్రం అందుకుంటున్న కంది సత్యనారాయణరెడ్డి

మద్దూరులో రేషన్ షాపులకు చేరని పూర్తిస్థాయి బియ్యం

మద్దూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా మూడు మాసాలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే మద్దూరు మండలంలో 13 రేషన్‌షాపులున్నాయి. ఒక్కోషాపుకు జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఆయా రేషన్‌డీలర్లకు పూర్తిస్థాయిలో ఇంకా చేరలేదు. నెలకు సరిపడా బియ్యాన్ని సైతం రేషన్‌షాపులకు సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులు రేషన్‌షాపుల వద్ద పడిగాపులు పడుతున్నారు. సరఫరా చేసిన కొద్దిపాటి బియ్యం రెండు మూడు రోజుల్లో అయిపోవడంతో రేషన్‌డీలర్లు తలలుపట్టుకుంటున్నారు. మరి కొన్ని రేషన్‌షాపుల్లో మిషన్లు పనిచేయకపోవడంతో రేషన్‌షాపులు తెరుచుకోలేదని తెలిసింది. రేషన్‌షాపుల్లో స్థల ప్రభావం వల్ల రేషన్ వేయలేదని, రెండో ట్రిప్పుల్లో వస్తాయని ఎదురుచూసిన డీలర్లకు రేషన్‌బియ్యం సరఫరా కాకుండా పోవడంతో కార్డుదారులు నిలదీస్తున్నారు.

కర్రెగుట్టలపై కన్నేసి.. కగార్‌తో కాల్చిచంపుతున్నారు



దుబ్బాకలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

దుబ్బాక, జూన్5(ఆంధ్రజ్యోతి): కర్రెగుట్టలో ఉన్న ఖనిజసంపదపై కన్నేసిన కేంద్రప్రభుత్వం వాటిని కాజేయడానికే కగార్‌పేరుతో మావోయిస్టులను కాల్చిచంపుతుందని రైతుకూలీ సంఘం, ప్రజాసంఘాల ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు కీసరి ఎల్లం పేర్కొన్నారు. గురువారం దుబ్బాకలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రైతుకూలీ సంఘం, ప్రజాసంఘాల ఆద్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశసంపద దేశ ప్రజలకు చెందాలనే లక్ష్యంతో మావోయిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. వారి డిమాండ్‌ను న్యాయబద్ధంగా అమలు చేయాల్సిన పాలకులు పెట్టుబడిదారుల చేతిలో పావులా తయారయ్యారన్నారు. దీనిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి, రామక్క, మేకల రామన్న, బాలన్న, మల్లేశం, తదితరులున్నారు.

చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

సిర్గాపూర్/ కల్హేర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్నో పోషక విలువలు ఉండే చిరు ధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డి.సేవానాయక్ అన్నారు. సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్, జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచూ చిరుధాన్యాల్లోని పోషకాలు, ప్రభుత్వ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్, సిర్గాపూర్ ఏవో హరిక్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఊరు.. బేజారు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్ సరఫరా, పైపులైన్లు, మంచినీటి ట్యాంకుల నిర్వహణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇవన్నీ కూడా నిధులతో ముడిపడి ఉన్నవే. సాధారణంగా ఇంటి పన్ను, నల్లా పన్నుతో ఈ పనులను చేయడం కష్టతరమే అవుతుంది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను సమన్వయం చేసుకుంటేనే పంచాయతీల నిర్వహణ సులభమవుతుంది. కేంద్ర నిధులు రావాలంటే పంచాయతీల్లో పాలకవర్గాలు కొనసాగుతూ ఉండాలి. అంటే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తేనే ఇది సాధ్యపడుతుంది.

నేనే స్ట్రీట్ లైట్ కొన్నాను



మాది చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్. బీసీ కాలనీలోని మా ఇంటి దగ్గర స్ట్రీట్‌లైట్ లేనందున పంచాయతీ సెక్రటరీకి చెప్పాను. మూడు బాటల దగ్గర చిమ్మచీకట్లు కమ్ముకుంటుంది. కరెంటోళ్లకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. నేనే 1200 ఖర్చుచేసి స్ట్రీట్‌లైట్ కొన్నాను. పంచాయతీలో డబ్బు లేక అధికారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. మా బాధలకు బాధ్యత ఎవరు వహిస్తారు.

- నాయకంరాజు, ఇబ్రహీంనగర్, సిద్దిపేట జిల్లా

బైక్‌ను ఢీకొన్న కారు.. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

కొండపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..కోహెడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వేణు గురువారం కమిషనర్ ఆఫీస్ నుంచి సిద్దిపేటకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి బయటకు రాగానే రాజీవ్ రహదారిపై అతడి వెనకాలే వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీ కొట్టడంతో ఆయన కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారమందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.


గాయపడిన కానిస్టేబుల్‌కు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

ట్రాక్టర్ బోల్తా - వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం


ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్ కింద చిక్కుకున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

మద్దూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలో ట్రాక్టర్ కింద చిక్కుకున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. గురువారం ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లద్నూరు గ్రామంలో ఇర్రి రాకేష్‌రెడ్డి ట్రాక్టర్‌ను తీసుకుని ఎల్లమ్మ చెరువుకట్ట మీదుగా వ్యవసాయ బావివద్దకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ కింద చిక్కుకున్న రాకేష్‌రెడ్డిని చుట్టుపక్కల వారు గమనించి 100 కాల్ చేసి సమాచారమందించారు. బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న రాకేష్‌రెడ్డిని బయటకు తీసి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రాథమిక చికిత్స జరిపించారు. అనంతరం మెరుగైన చికత్స కోసం అంబులెన్స్‌లో జనగామ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఈథనాల్ ఫ్యాక్టరీల అనుమతులు రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్

బెజ్జంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుగ్గిళ్ల, పోతారం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఈథనాల్ ఫ్యాక్టరీల అనుమతులు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం బెజ్జంకిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్మాణాల వల్ల కంపెనీల చుట్టూ ఉన్న 10 గ్రామాల పరిధిలో భూసారం దెబ్బతిని పంటలు పండక బీడుగా మారే అవకాశం ఉందన్నారు. నిర్మాణాలు చేపట్టవద్దంటూ ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల ప్రజలు నిరసనలు తెలిపి, అధికారులకు ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్లయ్య, సాయికృష్ణ. లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు వచ్చినా సంక్షేమం ఆగదు

దుబ్బాక, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజాసంక్షేమ పథకాలు ఆగవని సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పడాలవినయ్‌కుమార్, కాంగ్రెస్ ఓబీసీ జిల్లామాజీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.గత పదేళ్లలో తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం దివాళతీయించినప్పటికీ తమ ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి అనేకపాట్లు పడుతుందన్నారు. గురువారం వారు దుబ్బాకలో విలేకరులతో మాట్లాడుతూ... రాజీవ్‌యువవికాసం, రైతు నేస్తం, భూభారతిపై బీఆర్ఎస్‌పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో యువవికాసం జరిగితీరుతుందన్నారు. ప్రతిపక్షాల తప్పుడు మాటలు నమ్మవద్దని కోరారు.


మాట్లాడుతున్న జిల్లా యూత్‌కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి వినయ్‌కుమార్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌గౌడ్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నకోడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై, టీజీ పాలిసెట్ (2025)లో క్వాలిపై అయి ర్యాంకు పొంది ఉండాలన్నారు. వెబ్ సైట్ (హెచ్‌టీటీపీ://టీఎస్‌వీయూ.ఈడీయూ.ఇన్) నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలు నింపి ఈనెల 24వరకు పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, పరిపాలన కార్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్ 500030 చిరునామాకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాములు (9100956355)ను సంప్రదించాలని సూచించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పలు గ్రూపులలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. గురువారం ఆమె అడ్మిషన్ ప్రక్రియ వివరాలను వెల్లడించారు. 2025 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ పాస్ అయిన మహిళా విద్యార్థులు డిగ్రీ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని సూచించారు. బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్), బీఎస్సీ (ఎంపీసీ/ఎంపీసీఎస్), బీఎస్సీ (బీజడ్‌సీ), బీఎస్సీ(ఎంజెడ్‌సీ) బీకాం (సీఏ), బీకాం (జనరల్), బీఏ(హెచ్‌ఈపీ) కోర్సులలో అడ్మిషన్ పొందే అవకాశం ఉందన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ మెమో, 2025 జనవరి తర్వాత పొందిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్ ఇంటర్మీడియట్ టీసీ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23 వరకు విద్యార్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.


డాక్టర్ సునీత, కళాశాల ప్రిన్సిపాల్